
సాక్షి
ఒడిశా

శనివారం । 23 । నవంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 3,84,788
బంగారం: 9 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
వెండి: 7 గ్రాముల 350 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



గంజాయి తోట ధ్వంసం
గుమ్మి అటవీ ప్రాంతంలో గంజాయి తోటలు ఉన్నాయి. పోలీసులు ధ్వంసం చేశారు.
- 8లో



లక్ష్మణనాయక్‌కు నివాళులు
సహీద్ లక్ష్మణ్‌నాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాలు నెరవేరుస్తామన్నారు.
- 8లో

న్యూస్‌రీల్

జగన్నాథుని సేవలో గవర్నర్



రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ పూరీలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీ మందిరం సందర్శించి రత్న వేదికపై కొలువై ఉన్న శ్రీ జగన్నాథుని దర్శించుకున్నారు.
– భువనేశ్వర్

పింఛన్ కోసం మూడు కిలోమీటర్లు!

• ప్రతినెల ఇబ్బంది పడుతున్న వృద్ధురాలు



పింఛన్ కోసం వెళ్తున్న పున్నాలు

రాయగడ: ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ కోసం ఆ వృద్ధురాలు ప్రతినెలా మూడు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తోంది. జిల్లాలోని మునిగుడ సమితి ఘుముటిగుడ పంచాయతీ పరిధి జబగుడ గ్రామానికి చెందిన పునాలు వయసు 80 ఏళ్లు. ప్రభుత్వం అందించే మూడు వేల రూపాయల పింఛనే ఆమెకు ఆధారం. అయితే గ్రామంలో పింఛను అందజేసే అవకాశం లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలోని గురుండి పంచాయతీకి అధ్వానంగా ఉన్న రోడ్డుపై నడుకుంటూ వెళ్లి పింఛన్‌ను తీసుకుంటుంది. ఆ మార్గంలో వాహనాలు లేకపోవడంతో కాలినడకనే వెళ్లాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది. అధికారులు దయతలచి గ్రామంలోనే పింఛన్ డబ్బులను అందించే ఏర్పాటు చేయాలని పునాలు కోరుతున్నారు.

రైతులకు పరిహారం అందించాలి

పర్లాకిమిడి: ఈ ఏడాది ఖరీఫ్ పంట చేతికి వస్తుందని రైతులు సంబర పడుతుండగా కాశీనగర్ సమితిలో ఏనుగులు సంచారం, గుసాని సమితిలో అడవిపందుల స్వైర విహారంతో పంట నష్టాలకు గురిచేస్తున్నాయని గజపతి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ పట్నాయిక్ అన్నారు. కాశీనగర్ సమితిలో గోరిబంద, అల్లడ, గుసాని సమితిలో కత్తలకవిటి, పుఢ్గుని, అగరఖండి తదితర గ్రామాల్లో అడవిపందులు రాత్రిళ్లు వరి పంట నాశనం చేస్తున్నాయని అందువల్ల అటవీ శాఖ అధికారులు వన్యప్రాణులను పారద్రోలడానికి తగు చర్యలు చేపట్టాలని లేదా పంటనష్టం రైతులకు అందజేయాలని సూర్యనారాయణ పట్నాయిక్ డిమాండు చేశారు.

నేడే ప్రథమాష్టమి

• ఇంటింటా వేడుక • ఎండురి రుచుల ఘుమఘుమలు
• తొలి సంతానానికి మేనమామ కానుకలు
• శ్రీక్షేత్రం, ఏకామ్ర క్షేత్రాల్లో ప్రత్యేక యాత్ర



తొలి సంతానానికి ప్రథమాష్టమి పూజ (ఫైల్)



సిద్ధమైన ప్రథమాష్టమి ప్రత్యేకం ఎండురి పిండి వంటకం



మొవులియా క్షేత్రం నుంచి శ్రీ జగన్నాథుని కోసం శ్రీక్షేత్రానికి తరలిస్తున్న ప్రథమాష్టమి పూజా సామగ్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రథమాష్టమి వేడుకలకు అంతా సిద్ధమైంది. స్థానిక పంచాంగ గణాంకాల ప్రకారం మార్గశిర మాసం కృష్ణ పక్ష అష్టమి ప్రథమాష్టమిగా ప్రతీతి. ఈ తిథిని సౌభాగిని అష్టమి, కాల భైరవ అష్టమి, పాప నాశిని అష్టమిగా కూడా చెబుతారు. శ్రీక్షేత్రం, ఏకామ్ర క్షేత్రంలో ప్రథమాష్టమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఇంటింటా వేడుక

ఈ తిథి నాడు కుటుంబంలో తొలి సంతానం ముద్దు, ముచ్చటతో ఆనందోత్సాహాలతో వేడుక చేసుకుంటారు. జ్యేష్ఠ సంతానం దీర్ఘాయుష్షు కోసం జ్యేష్ఠా దేవిని పూజిస్తారు. ఈ సందర్భంగా ఆడ, మగ నిమిత్తం లేకుండా తొలి సంతానం ఎవరైనా వారికి కొత్త బట్టలు తొడిగి పీటపై కూర్చోబెట్టి జ్యేష్ఠా దేవికి దీపారాధన చేసి నుదుట తిలకం దిద్ది శిరసున అక్షతలు జల్లి పెద్దలు ఆశీర్వదిస్తారు.

ఆచారం.. ఆత్మీయం

ప్రథమాష్టమి వేడుక ఆచారం, ఆత్మీయతల మేలి కలయిక. తోబుట్టువుకు తొలి సంతానం కలగడం మేనమామకు ఎనలేని ఆనందం పంచి పెడుతుంది. ఈ మనోభావానికి ప్రతీకగా ఏటా మార్గశిర మాసం అష్టమి నాడు మేనల్లుడు లేదా మేనగోడలికి కొత్త బట్టలు, మిఠాయి కానుకగా సమర్పించడం ఆచారం. ప్రాచీన కాలంలో మార్గ శిరం ఏడాదిలో తొలి మాసం. ఈ మాసంలో తొలి అష్టమి ప్రథమాష్టమిగా ప్రాచుర్యం సాధించడంతో నేటికి ఇదే సంప్రదాయం కొనసాగుతుంది.

ఎండురి పిండి వంటకం

ప్రథమాష్టమి వేడుకలో ఎండురి పిండి వంటకం విభిన్నం. ఏడాదిలో ఒకే ఒకసారి ఈ వంటకం తారసపడుతుంది. మినప రుబ్బులో కొబ్బరి కోరు, బెల్లం, పెసర పప్పు మిశ్రమం పసుపు కొమ్ముల ఆకుల్లో పేర్చి ఆవిరి పట్టించడంతో ఎండురి పిండి వంటకం సిద్ధం అవుతుంది. ఈ వంటకం జ్యేష్ఠా దేవికి అత్యంత ప్రీతిపాత్రమైన నైవేద్యంగా పరిగణిస్తారు. ప్రథమాష్టమి మినహా ఏడాది పొడవునా ఇతర సందర్భాల్లో ఈ వంటకం జాడ ఉండకపోవడం విభిన్నం. దీంతో పాయసం కూడా ఆరగిస్తారు.

పాత్ర ప్రత్యేకం

ఎండురి ఆవిరి పెట్టేందుకు వినియోగించే పాత్ర ప్రత్యేకం. దీని కోసం కొత్తగా ఒక మట్టి పాత్రని సిద్ధం చేస్తారు. 7 రోజులు ముందుగా దీన్ని సిద్ధం చేసుకుని ఎండురి వంటకం కోసం వినియోగిస్తారు. ఈ వంటకం తయారీ పూర్తి కావడంతో ఈ కుండని పగలగొట్టడం ఆచారం.



ఎండురి తయారీ కోసం సిద్ధం చేసిన పసుపు ఆకులు

తాంత్రిక ప్రాముఖ్యత

ప్రథమాష్టమి తాంత్రికంగా ప్రాముఖ్యత సంతరించుకుంది. తంత్ర సాధకులకు ఈ రాత్రి అత్యంత కీలకం. తాంత్రిక సంప్రదాయంలో ఘోర రాత్రిగా పేర్కొంటారు. ఈ తిథి నాడు ఆది శక్తి కాల రాత్రి రూపంలో అవతరించినట్లు తాంత్రిక వర్గీయులు పరిగణిస్తారు.

లింగరాజు యాత్ర

భువనేశ్వర్ లింగరాజు మహా ప్రభువు ప్రథమాష్టమి వేడుకని యాత్రగా జరుపుకోవడం విశేషం. ఈ తిథి నాడు మహా ప్రభువు మేనమామ సన్నిధికి తరలి వెళ్తాడు. స్థానిక కపాలి మఠం లింగ రాజు మహా ప్రభువు మేనమామ సన్నిధి. ఈ సన్నిధి ఆరాధ్య దైవం వరుణేశ్వర్, బలదేవ్. ఈ మఠం ప్రాంగణంలో పాపనాశిని పుష్కరిణి ఉంటుంది. ప్రథమాష్టమి పురస్కరించుకుని ఈ పుష్కరిణి జలం స్వీకరిస్తే సకల పాపాలు తొలగిపోతాయని నమ్ముతారు.

శ్రీక్షేత్రంలో ప్రథమాష్టమి

పూరీ శ్రీ జగన్నాథుని సంస్కృతిలో ప్రథమాష్టమి వేడుకగా నిర్వహిస్తారు. స్వామికి మేనమామ దగ్గర నుంచి సంప్రదాయ భారం (కావడి) సంప్రదాయరీతిలో తరలి వస్తుంది. నియాలి ప్రాంతం మొవులా క్షేత్రం నుంచి పూరీ శ్రీ జగన్నాథుడు కొలువు దీరిన శ్రీ మందిరానికి ప్రథమాష్టమి పూజా సామగ్రి చేరుతుంది. సప్తమి నాడు ఒక రోజు ముందుగా ఈ సామగ్రి తరలిస్తారు. వీటిలో పచ్చి బియ్యం, మినుములు, కొబ్బరి, బెల్లం, అరటి పండ్లు, నెయ్యి, చందనపు చెక్క, కర్పూరం, జాజికాయ, తమలపాకులు, వక్క, ఏలకులు, లవంగాలు, గోపాల వల్లభ భోగం కోసం పలు రకాల పండ్లు, కాయలు మరియు భగవంతుని అలంకరణ కోసం పద్మ పూలు ఉంటాయి. మొవులా క్షేత్రం అధిష్టాన దైవం శ్రీ మాధవుడు శ్రీ జగన్నాథుని మేనమామగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ప్రథమాష్టమి పురస్కరించుకుని స్వామి కోసం శ్రీ మందిరానికి ప్రథమాష్టమి సరుకులు చేరుతాయి.

మేళతాళాలతో ...

ప్రాచీన తీరం మొవులియా క్షేత్రం నుంచి శ్రీ జగన్నాథుని కోసం ప్రథమాష్టమి సామగ్రిని సంప్రదాయ మేళతాళాలతో తరలిస్తారు. భోయి సేవకులు ఆధ్యాత్మిక పతాకంతో ముందడుగు వేస్తుండగా ఢోలియా, మొహురియా సేవకులు దారి పొడవునా వాద్య సంగీతంతో ఉర్రూతలూగిస్తారు. వీరి వెంబడి గొడువా సేవకులు పాయికా నృత్య (యుద్ధ విన్యాసాలు) ప్రదర్శనతో అత్యంత ఆనందోత్సాహాలతో శ్రీనీలమాధవుడు సమర్పించిన సామగ్రిని యాత్రగా శ్రీ జగన్నాథుని కోసం తరలిస్తారు. ఈ యాత్ర రెండు విడతల్లో సాగుతుంది. మొవులియా క్షేత్రం నుంచి తొలుత పూరీ శ్రీ గుండిచా మందిరం ప్రాంగణానికి చేరుతుంది. కాసేపటి విరామంతో మలి విడత యాత్రగా శ్రీ మందిరానికి యాత్ర మొదలవుతుంది. పూజా సామగ్రిని శ్రీ మందిరం అధికారిక కార్యాలయంలో జమ చేస్తారు. దేవస్థానం పండితుల సూచన మేరకు శాస్త్రోక్తంగా ఈ సామగ్రిని ప్రధాన దేవాలయానికి తరలిస్తారు. ప్రాచీ తీరం నుంచి మాధవ, చంద్రమౌళి, చారిఛొకొ, గోప్, గణేశ్వరపూర్, నాగపూర్, షోలపూర్, మదరంగ్, ఛొయితొనా, బల్లిఘాయి, బల్లిగువాలి మీదుగా పూరీ గుండిచా మందిరం వరకు యాత్ర సాగుతుంది.

• రోడ్డుపై వారపు సంత!



ప్రధాన రహదారిపై కొనసాగుతున్న వారపు సంత

• రాకపోకలకు ఇబ్బంది
• కేటాయించిన స్థలంలో సంతను నిర్వహించాలని ప్రజల డిమాండ్

రాయగడ: జిల్లాలోని అంబొదల వద్ద ప్రతీ సోమవారం జరిగే వారపు సంతను వేరే ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అందువల్ల దీనిని వేరే ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రత్యేకంగా వారపు సంత కోసం ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని వ్యాపారులు వదిలేసి ప్రధాన రహదారిపై సంతను ఏర్పాటు చేస్తుండడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే విషయమై పంచాయతీ, సమితి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని వారపు సంతను తన యథాస్థానం వద్ద ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మావోల కదలికలపై నిఘా



జినెల్‌గూడ గ్రామ అడవిలో కూంబింగ్ నిర్వహిస్తున్న జవాన్లు



మెటగూడ ప్రాంతంలో ఎగురుతున్న డ్రోన్ కెమెరా



అడవిలో డ్రోన్ కెమెరా అప్‌డేట్ మిషన్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాకు అనుకుని ఉన్న మూడు రాష్ట్రాల సరిహద్దులను సీజ్‌చేసి మావోల కదలికలపై నిఘా పెట్టేందుకు ఒడిశా-చత్తీస్‌గఢ్, చత్తీస్‌గఢ్-తెలంగాణ, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు పెట్టారు. శుక్రవారం తొలి డ్రోన్ కెమెరా ఎంవీ 79 పోలీస్ స్టేషన్ పరిధిలో గల జినెల్‌గూఢ అడవిలో ఎగిరింది. శబరి నది ప్రాంతంలో ఉన్న మెటగూఢ, కాటన్‌పల్లి మధ్య ఉన్న గ్రామాల్లోకి హెలికాప్టర్ ద్వారా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించి అక్కడ కూడా డ్రోన్ వాడారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమ జిల్లా ఒడిమ్‌గూఢ-ఎర్రబార గిరిజన గ్రామాల మధ్య సరిహద్దులోనూ డ్రోన్లు ఎగరేశారు. అలానే మల్కన్‌గిరి జిల్లా నుంచి కలిమెల సమితి మోటు మీదుగా వెళ్లే రాష్ట్రాల సరిహద్దులను పూర్తిగా మూసేశారు. జినెల్‌గూఢ, టొంకెల్‌గఢ రహదారుల్లో జవాన్లు ముమ్మరంగా గస్తీ కాస్తున్నారు. వాహనాలను పరిశీలించాకే వదులుతున్నారు.

రహదారి రక్తసిక్తం

• ట్రక్కు, బైక్ ఢీకొని నలుగురు మృతి



ప్రమాదానికి గురైన బైక్



చెల్లాచెదురుగా పడి ఉన్న మృత దేహాలు



ప్రమాదానికి కారణమైన ట్రక్కు వద్ద ప్రజలు

జయపురం: జయపురం-బొయిపరిగుడల మధ్య విజయవాడ-రాంచీ 326 జాతీయ రహదారిలో శుక్రవారం ఘోర ప్రమాదం జరిగింది. జయపురం సమితి పాత్రోపుట్ గ్రామ పంచాయతీ జబకనాడి గ్రామం సమీపంలో లోడుతో వస్తున్న ఒక ట్రక్కు జాతీయ రహదారిపై వెళ్తుండగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఆనవాళ్లు కూడా లేకుండా మృతదేహాలు ఛిద్రమైపోయాయి. పొగమంచు దట్టంగా ఉండడం వలన ఈ ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న జయపురం సదర్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లారు.

హోటళ్లపై విస్తృత దాడులు



హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రాయగడ: పట్టణంలోని పలు హోటళ్లపై సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, ఏసీఎస్‌వో సుధాంశు భోయ్, సిబ్బంది గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని విజయలక్ష్మి, కేజీఎస్ హోటళ్లలో సోదాలు చేపట్టారు. దీంట్లో భాగంగా నియమాలకు విరుద్ధం వంటగ్యాస్‌ను వినియోగిస్తుండడంతో ఆయా హోటళ్ల నుంచి 12 డొమస్టిక్ గ్యాస్ సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా స్థానిక గాంధీ నగర్‌లోని ఒక స్వీట్ తయారీ కంపెనీలో పరిసరాల శుభ్రత పాటించకపోవడంతో ఆ తయారీ కేంద్రాన్ని మూసివేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా పలు హోటళ్లలో నాణ్యత లోపించిన ఆహారం విక్రయిస్తున్నారని, అదేవిధంగా అవసరానికి మించి అధిక శాతం కెమికల్స్ వంటి పదార్థాలు వినియోగిస్తున్నారన్నారు. అనంతరం పలు హోటళ్లపై భారీ జరిమానా విధించారు.

గంజాయి పంట ధ్వంసం



గంజాయి మొక్కలు ధ్వంసం చేస్తున్న భద్రతా బలగాలు

కొరాపుట్: అక్రమ గంజాయి సాగుపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపాయి. శుక్రవారం కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ పోలీస్‌స్టేషన్ పరిధి పాలమ్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో 38 ఎకరాల్లో పండిస్తున్న 53,200 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో కొరాపుట్, నందపూర్, పొట్టంగి ఎక్సైజ్ పోలీసులు, మాచ్‌ఖండ్ పోలీసులు, డీవీఎఫ్, డీఎస్ఎఫ్ బృందాలు పాల్గొన్నాయి.

మృతదేహం కోసం బంధువుల రాక



ఎంక సునమ్ మృతదేహం



జిల్లా పోలీసు కార్యాలయం వద్ద పోలీసులతో చర్చిస్తున్న ఎంక సునమ్ భార్య, బంధువు

మల్కన్‌గిరి: పోలీసుల ఎదురు కాల్పుల్లో చనిపోయిన వ్యక్తి కోసం ఆయన బంధువులు వచ్చారు. వారికి మృతదేహాన్ని అప్పగించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. బుధవారం రాత్రి సమయంలో మావోయిస్టులు శబరి నది దాటుతుండగా ఎదురు కాల్పులు జరిగాయి. అయితే మావోలు నది దాటడానికి ఎంక సునమ్ అనే మత్స్యకారుడు సాయం చేశారు. ఈయన పొడియ సమితి మెటగూఢ గ్రామ పెద్ద. మావోలను అడవిలోకి పంపేందుకు తన పడవలో దింపాడు. అడవిలో మార్గం చూపిస్తుండగా డీవీఎఫ్ జవాన్లు తారసపడ్డారు. అక్కడ జరిగిన ఎదురు కాల్పుల్లో ఎంక సునమ్ ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న ఎంక సునమ్ భార్య, ఆయన సోదరుడు శుక్రవారం మల్కన్‌గిరి ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. మావోయిస్టులు వచ్చి నది దాటించాలని కోరారని, పోలీసులే మావోయిస్టు ముద్ర వేసి చంపేశారని చెప్పారు. పోలీసులు మాత్రం ఎంక పూర్తిగా మావోల సానుభూతిపరుడని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం ఎంక మృతదేహాన్ని అప్పగించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

జయపురం: మార్నింగ్ వాక్‌కు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ సంఘటన బొరిగుమ్మలో చోటు చేసుకుంది. బొరిగుమ్మ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పితాంబర పూజారి(59) రోజూ మార్నింగ్ వాక్‌కు వెళ్తుంటారు. ఎప్పటిలాగానే శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో బొరిగుమ్మ 28వ నంబర్ రాష్ట్ర రహదారి దుల్లాగుడ సమీప రాణిగుడ వరకు వెళ్లి బొరిగుమ్మ తిరిగి వస్తుండగా ఒక గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ప్రమాదంలో పూజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని చూచిన వారు వెంటనే బొరిగుమ్మ పోలీసులకు తెలియజేశారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పూజారిని బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే పూజారి మరణించినట్లు డాక్టర్లు ప్రకటించారు. మృతదేహానికి పోస్టుమార్టం జరిపి అతడి బంధువులకు అప్పగించారు. బొరిగుమ్మ సబ్‌డివిజన్ పోలీసు అధికారి తపశ్వణీ కొహార్, ఎస్‌ఐ రొచిత మడకామి, మానస హేమ్బ్రమ్, మేఘనాత్ సోరెన్, ద్రోణాచార్య బాగ్, ఏఎస్‌ఐ సస్మిత నాయిక్, గోపాల్ హరిజన్, బసంత కుమార్ బాగ్, చందన ప్రసాద్ మరియు తదితరులు నివాళులర్పించారు. ఢీకొన్న వాహణం కొట్‌పాడ్ దిశలో వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

రైతుల సేవలో బొరిగుమ్మ లేంపునకు రాష్ట్రస్థాయి బహుమతి

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ లేంపు రాష్ట్ర స్థాయిలో రెండో ఉత్తమ బహుమతి పొందింది. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ జయదేవ్ భవనంలో గురువారం నిర్వహించిన 71 వ అఖిల భారత సహకారోత్సవాల్లో బొరిగుమ్మ లేంపునకు ఈ గౌరవం దక్కింది. విధాన సభ స్పీకర్ సురమ్ పాఢీ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని బొరిగుమ్మ లేంప్ వ్యవసాయ ఉన్నతికి రైతులకు అందించిన సేవలకు మెచ్చి ప్రశంసా పత్రంతో పాటు మెమోంటో లతో లేంపు అధ్యక్షుడు లాలూమ జీసంగ్, లేంపు మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్న మిశ్ర సన్మానించారు.

ఏడు బైక్‌లు సీజ్



పోలీసులు పట్టుకుని సైలెన్సర్లు తొలగించిన బైక్‌లు

జయపురం: శబ్ద కాలుష్యం చేస్తున్న బైక్‌లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గురువారం రాత్రి జయపురం పట్టణ పోలీసులు శబ్దాలు సృష్టిస్తున్న 7 బైక్‌లను సీజ్ చేసి వాటి సైలెన్సర్లను తొలగించినట్లు పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయి శుక్రవారం వెల్లడించారు. ఆయా మోటారు బైక్ యజమానుల నుంచి రూ.4,000 జరిమానా వసూలు చేసినట్లు ఆయన వెల్లడించారు. పోలీసు సిబ్బంది 326 విజయవాడ–రాంచీ జాతీయ రహదారిలో తనిఖీలు చేస్తూ ఎక్కువ శబ్దంతో వెళ్తున్న బైక్‌లను ఆపి సైలెన్సర్లను తొలగించారు. సైలెన్సర్లను మార్చిన తర్వాత వారికి బైక్ లు అప్పగించినట్లు తెలిపారు.

గుడారిలో గంజాయి తోట ధ్వంసం



గంజాయి మొక్కలను నాశనం చేస్తున్న ఉద్యోగి

రాయగడ: జిల్లాలోని గుదారి పోలీస్ స్టేషన్ పరిధి గుమ్మి అటవీ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి తోటను పోలీసులు, అబ్కారి శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన దాడుల్లో నాశనం చేశారు. రహస్యంగా అందిన సమాచారం మేరకు జిల్లా ఎస్పీ స్వాతి ఎస్ కుమార్ ఆదేశానుసారం సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న గంజాయితోను గుర్తించి కట్ చేసి తగులబెట్టారు. సుమారు 18 వేల గంజాయి మొక్కలు నాశనం చేసినట్లు అధికారులు చెప్పారు.

రాష్ట్రపతి పర్యటనకు సన్నద్ధత

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఆమె 4 రోజుల పర్యటన కోసం రాష్ట్రానికి విచ్చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు నెల 3 నుంచి 7వ తేదీ వరకు పలు జిల్లాలు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల ప్రారంభం, శంకు స్థాపన, ప్రముఖులతో భేటీ, విద్యార్థులతో ముచ్చటతో స్వగ్రామం సందర్శన, సొంత ఇంటిలో బస వంటి కార్యక్రాలు ఉన్నాయి. రాష్ట్ర పర్యటన ముగించుకుని కోల్‌కత్తా మీదుగా న్యూఢిల్లీ తిరుగు పయనం అవుతారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ఆగమనం నుంచి తిరుగు ప్రయాణం వరకు ఆద్యంతాలు భద్రతా ఏర్పాట్లతో వసతి, పర్యటన ఇతరేతర అనుబంధ కార్యకలాపాల సన్నద్ధతని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా శుక్రవారం సమీక్షించారు.

లక్ష్మణ్‌నాయక్ ఆశయాలను కొనసాగించాలి

● నివాళులర్పించిన ప్రముఖులు



రాయగడ: లక్ష్మణ్ నాయక్‌కు విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కరరైతా



జయపురం: లక్ష్మణ నాయక్ అమర్ రహే అని నినదిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు



జయపురం: లక్ష్మణనాయక్‌కు నివాళులర్పిస్తున్న జయపురం సబ్‌కలెక్టర్ తదితరులు

రాయగడ:

స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీ నాయకుడు సహీద్ లక్ష్మణ్ నాయక్ ఆశయాలను కొనసాగించాలని వక్తలు పిలుపునిచ్చారు. లక్ష్మణ్ నాయక్ 125వ జయంతిని శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాయగడలోని శాస్త్రీనగర్‌లో ఉన్న లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరైతా, వాటర్ షెడ్ పీడీ దయానిధి బాగ్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంతకుమార్ ప్రధాన్ తదితర ప్రముఖులు హాజరై లక్ష్మణ్ నాయక్ సేవలను గుర్తు చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు లక్ష్మణ్ నాయక్ పోరాట పటిమను గురించి కొనియాడారు.

కొరాపుట్: స్వాతంత్ర్య పోరాటంలో బలిదానం చేసిన కొరాపుట్ జిల్లాల గిరిజన యోధుడు సాహీద్ లక్ష్మణ్ నాయక్ జయంతిని కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌లోని లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి పొట్టంగి ఎమ్మెల్యే రాంచంద్ర ఖడం, కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొరాపుట్ జిల్లా సునాబెడా మున్సిపల్ చైర్మన్ రాజేంద్రకుమార్ పాత్రో పట్టణంలోని సహచర కౌన్సిలర్లతో వెళ్లి లక్ష్మణ్ నాయక్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆయన విగ్రహానికి విద్యార్థులు నివాళులర్పించారు.



రాయగడ: లక్ష్మణ్ నాయక్ గురించి మాట్లాడుతున్న విద్యార్థులు



జయపురం: లక్ష్మణనాయక్ జయంతి కార్యక్రమంలో స్మృతి సమితి అధ్యక్షుడు మదన నాయక్

జయపురం: సహిద్ లక్ష్మణ నాయక్ జయంతి కార్యక్రమాన్ని జయపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. స్థానిక గుప్తేశ్వర కాంప్లెక్స్ ప్రాంగణంలోని లక్ష్మణ నాయక్ విగ్రహానికి జయపురం సబ్‌కలెక్టర్ ఎ.శౌర్యరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమెతో పాటు జయపురం సబ్‌డివిజన్ ఏడీపీఆర్వో యశోద గడబ తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మణ నాయక్ జన్మస్థలం తెంతులిగుమ్మకు సబ్ కలెక్టర్ శౌర్యరెడ్డి వెళ్లారు. అలాగే లక్ష్మణ నాయక్ స్మృతి సమితి జయపురం వారు నాయక్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్మృతి సమితి అధ్యక్షుడు మదన మోహననాయక్, కార్యదర్శి మాధవ చౌదురి, ఉపాధ్యక్షులు గౌరవ బోత్ర, సహాయ కార్యదర్శి వెంకటరావు పట్నాయక్, సలహాదారులు బాలా రాయ్, కృష్ణ చంద్రహౌత్త, సురేంద్రఖొర, అదివాసీ, దళిత మహాసంఘం మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు మమత నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొట్‌పాడ్‌లో..

కొట్‌పాడ్‌లో సాహిద్ లక్ష్మణ నాయక్ జయంతిని ఆదివాసీ సంఘం నిర్వహించారు. లక్ష్మణ నాయిక్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని గరల్స్ హైస్కూల్ అవరణలో ఉన్న లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్‌ప్రధన్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్కన్‌గిరి జిల్లా కోసం లక్ష్మణ్ నాయక్ వ్యక్తిగా కాకుండా శక్తిగా చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌వో ప్రమిళ మారిు, పాఠశాల ఉపాధ్యాయుడు ధఢుష్మంతో జెన, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్



మల్కన్‌గిరి: లక్ష్మణ్ నాయక్ విగ్రహం వద్ద అధికారులు



కొరాపుట్‌లోని లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పొట్టంగి ఎమ్మెల్యే రాంచంద్ర ఖడం, జెడ్పీ చైర్మన్ సస్మతా మెలక



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు



కొరాపుట్: సునాబెడాలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేంద్ర కుమార్ పాత్రో

మోహనలో ఆశా వర్కరు పోస్టుకు కుమ్ములాటలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన బ్లాక్ టి.లక్ష్మీపూర్ గ్రామానికి ఆశా వర్కరు పదవి ఒకటి ఖాళీగా ఉందని అధికారులు ప్రకటించారు. ఆశా వర్కరు ఒక్క పోస్టు కోసం మోహనా మెడికల్ ఆఫీసర్ వద్ద కుమ్ములాట సాగింది. ఈ ఉద్యోగం కోసం పాణిగండ పంచాయతీ టి.లక్ష్మీపూర్ గ్రామం నుంచి మమతా నాయక్, శ్రీమంజలి మల్లిక్ అనే ఇద్దరు మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో మమతా నాయక్ స్థానికేతర అభ్యర్థి అని, లక్ష్మీపురం గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ మోహన మెడికల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. కటక్‌కు చెందిన మమతా నాయక్ టి.లక్ష్మీపూర్‌లో ఇటీవల వచ్చి నివాసం ఉంటోందని, ఆమె స్థానికేతర మహిళ అని సర్పంచు, వార్డుమెంబరు ప్రణతి బలియార్ సింగ్, గ్రామ అభివృద్ధి కమిటీ ఇవ్వాలని గురువారం మోహనా మెడికల్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆశా వర్కరు పోస్టుకు అర్హతపై ఉన్నతాధికారులు ఎంపిక చేస్తారని మెడికల్ ఆఫీసర్ అన్నారు.

హత్య కేసులో నిర్దోషిగా మావో నేత సవ్యసాచి

రాయగడ: మావోయిస్టు నేత సవ్యసాచి పండాను ఒక హత్య కేసుకు సంబంధించి నిర్దోషిగా గుణుపూర్ ఏడీజే కోర్టు తీర్పునిచ్చింది. శుక్రవారం ఈ కేసుకు సంబంధించి పూర్తి పోలీసు బందోబస్తు మధ్య సవ్యసాచి పండాను కోర్టులో హాజరుపరిచారు. సాక్షులను విచారించిన కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. 2004 ఆగస్టు 13న చంద్రపూర్ సమితి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాకు మాఝి అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ క్రమంలో మావో నేత సవ్యసాచి పండాను ఈ కేసుకు సంబంధించి పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. డాకు మాఝి సమితి కార్యకలాపాలను నిర్వహించి బైకుపై ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ప్రధాన రహదారి వద్ద కొందరు మావోయిస్టులు అతనిపై దాడి చేసి హత్య చేశారు. ఇందులో సవ్యసాచి పండా కీలక పాత్ర పోషించినట్లుగా భావించిన పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి విచారణకు రాగా శుక్రవారం గుణుపూర్ ఏడీజే కోర్టు 18 మంది సాక్షులను విచారించి తీర్పు వెల్లడించిందని పండా తరఫు న్యాయవాది బ్రహ్మానంద పట్నాయక్ తెలిపారు.



కోర్టుకు హాజరైన పండా

క్రీడాకారుడు ఉపేంద్ర మహరాణ మృతికి సంతాపం



ఉపేంద్ర మహారాణ సంతాపసభలో క్రీడాకారులు

జయపురం: కొరాపుట్ జిల్లాలో ప్రముఖ క్రీడాకారుడు ఉపేంద్ర మహరాణ అకాల మృతిపై క్రీడాకారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక విక్రమ మైదానంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఉపేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి.. రెండు నిమిషాలు మౌనం పాటించారు. జయపురం సబ్‌డివిజన్ అట్లథిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయిక్ అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో ఉపేంద్ర మహారాణ క్రీడా రంగానికి చేసిన సేవలు కొనియాడారు. ఆయన ఆకస్మిక మృతి క్రీడాలోకానికి తీరని లోటన్నారు. ఉపేంద్ర పుట్‌బాల్, వాలీబాల్ విశేష ప్రతిభ ప్రశంసనీయమన్నారు. అతడి శిక్షణతో పలువురు యువకులు మంచి ఆటగాళ్లు అయ్యారని గుర్తు చేశారు. సంతాపసభలో మోహణ గౌఢ, మోహణ మఝి, శివశంకర బిశ్వాల్, రమేష్ సాహు, తరుణ కుమార్ మహాప్రాత్ర, టిను పాణి గ్రహి, బలియ పాణిగ్రహి పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టే ఎయిర్‌పోర్టు వద్దు



ఎయిర్ పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా సమావేశమైన ఉద్దాన రైతులు

వజ్రపుకొత్తూరు రూరల్/కాశీబుగ్గ: మందస, వజ్రపుకొత్తూరు మండలాల సరిహద్దు ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ఉద్దాన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో ఓ వైపు కేంద్ర బృందం(ఏఏఐ) స్థల పరిశీలన చేస్తుంటే.. మరో వైపు స్థానిక ఉద్దాన రైతులు నుంచి వ్యతిరేక సెగలు మొదలయ్యాయి. ఆయా మండలాల సరిహద్దు గ్రామాల్లో రైతులు చర్చలు జరిపి మందస మండలం రాంపురం పంచాయతీలో శుక్రవారం ఉద్దాన రైతులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎయిర్ పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్దాన రైతులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉద్యాన పంటలను నమ్ముకొని పిల్లాపాపలతో జీవనోపాధి సాగిస్తున్నామని చెప్పారు. తాము నమ్ముకున్న భూమిని వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మాకు నష్టం కలిగించే ఎలాంటి ఎయిర్‌పోర్టులు వద్దు.. మా భూములే ముద్దు అంటూ ముక్తకంఠంతో నినదించారు.

వీధికెక్కిన వెండితెర ప్రముఖులు





నగర డీసీపీ కార్యాలయం ఆవరణలో తలపడిన డైరెక్టరు బాబీ ఇస్లాం, నటుడు మనోజ్ మిశ్రా

భువనేశ్వర్: ఒడియా వెండి తెర ప్రముఖుల వివాదం వీధికి ఎక్కింది. వీరిలో దర్శకుడు బాబీ ఇస్లాం, నటుడు మనోజ్ మిశ్రా ఉన్నారు. వీరితో మరో దర్శకుడు జ్యోతి దాస్ ఉన్నాడు. బాబీ, మనోజ్ మధ్య మనస్పర్థలు తొలగించి వివాదం పరిష్కారం కోసం నగర కమిషనరేటు పోలీసులు పిలిపించారు. ఈ సందర్భంగా ఈ రెండు వర్గాలు శుక్రవారం నగర డీసీపీ కార్యాలయం ఆవరణకు చేరడంతో రెచ్చిపోయారు. బాహాబాహిగా తలపడ్డారు. నడి రోడ్డు మీద వెండి తెర ప్రముఖుల ప్రత్యక్ష పోరుతో సాధారణ ప్రజానీకం అవాక్కయ్యారు. పోలీసులు చొరవ కల్పించుకుని ఇరువుర్ని శాంతింపజేసి మంతనాలు ప్రారంభించారు. నటుడు మనోజ్ మిశ్రా దర్శకుడు బాబీ ఇస్లాంకు వాట్సాప్ ఫోను సంభాషణలో ప్రాణం తీస్తానని బెదిరించినట్లు ఆరోపణ. గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఇదే పరిస్థితి తనకు కూడా ఎదురైనట్లు మరో దర్శకుడు జ్యోతి దాస్ తోడయ్యాడు. మనోజ్, బాబీ మధ్య వివాదం సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు పోలీసుల పిలుపు మేరకు విచ్చేసిన ఇరు వర్గాలు తలపడడంతో డీసీపీ కార్యాలయం పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం: మంత్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో అక్రమ మద్యం తయారీ, పంపిణీ, విక్రయం వంటి కార్యకలాపాల్ని పూర్తిగా అణచి వేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందని అబ్కారి శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ శుక్ర వారం తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల తరచూ తలెత్తుతున్న అక్రమ మద్యం రవాణా, కల్తీ సారా మృతులు వంటి సంఘటనలతో ప్రభుత్వం ఘాటుగా స్పందించి ఈ మేరకు నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. అక్రమ మద్యం డిస్టిలరీలు ఇతర తయారీ స్థావరాలపై నిఘా వేసి ఉత్పాదన, పంపిణీ, విక్రయాల లావాదేవీల్ని మూలాలతో తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆయా ప్రాంతాలపై తమ విభాగం నిరంతరం నిఘా వేసి ఉంటుందన్నారు. అక్రమ మద్యం అణచి వేత పురస్కరించుకుని చట్ట సంస్కరణ సోపానంగా ప్రభుత్వం నిర్ధారించింది. ఈ దిశలో చర్యలు చేపట్టేందుకు అనుబంధ వర్గాల నిపుణులు, అనుభవజ్ఞులతో విభాగం ప్రత్యక్షంగా సంప్రదింపులు జరుపుతుంది. వీరి సలహాలు, మార్గదర్శకాలి క్రోడీకరించి చట్ట సంస్కరణలు చేపట్టనున్నారు.

మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల లావాదేవీల్ని విభాగం అరికడుతోంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఎన్‌సీబీ, అబ్కారి విభాగాన్ని సమన్వయ పరచి వ్యూహాత్మక కార్యాచరణకు తుది మెరుగులు దిద్దుతోందని విభాగం మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ముఠాల్ని మట్టుబెట్టడం లక్ష్యంగా పేర్కొన్నారు.

బీజేడీ పార్లమెంటరీ సమావేశం

భువనేశ్వర్: భారత పార్లమెంటు శీతాకాలం సమావేశాలను పురస్కరించుకుని బిజూ జనతా దళ్ పార్లమెంటు సభ్యులు సమావేశమయ్యారు. స్థానిక నవీన్ నివాస్‌లో బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ అధ్యక్షతన ఈ సమావేశం శుక్రవారం జరిగింది. త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాలం సమావేశంలో పార్టీ వైఖరిపై సభ్యులకు అవగాహన కల్పించారు.

జవాన్ మృతితో విషాదం

సోంపేట: మండలంలోని తురకశాసనాం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ వెదుళ్ల నాగేశ్వరరావు (58) గురువారం అరుణాచల్‌ప్రదేశ్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఈయన 28 ఏళ్లుగా జీఆర్‌ఈఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఉండగా గుండెపోటు రావడంతో వైద్యసేవలు అందజేసినా ఫలితం లేకపోయింది. మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకొచ్చి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. నాగేశ్వరరావుకు భార్య కమలమ్మ, కుమారుడు ఆకాష్, కుమార్తె అనూష ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఆర్మీలోనే విధులు నిర్వహిస్తున్నాడు. నాగేశ్వరరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



ఆస్పత్రి వద్ద నరసింహ మృతదేహం

రాయగడ: అప్పుల బాధ తాళలేక ఒక చిరు వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని బిసంకటక్ సమితి హజరిడంగ్ గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. హజరిడంగ్ గ్రామంలో నివసిస్తున్న నరసింహ కుసులియా(55) అనే వ్యక్తి చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో గత కొద్ది నెలలుగా వ్యాపారంలో తీవ్ర నష్టాలను చవిచూడడంతో గత్యంతరం లేక కొంత మొత్తం అప్పులు చేసి వ్యాపారాన్ని కొనసాగించాడు. అయితే తెచ్చిన అప్పులను సకాలంలో తీర్చలేకపోవడంతో అప్పులు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో విరక్తి చెందిన నరసింహ జంబుగుడ గ్రామ సమీపంలోని ఒక జీడి తోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అంతకు ముందు తన కొడుకైన లోకేష్‌కు ఫోన్‌చేసి, తను జంబుగుడ వద్దనున్న ఒక జీడితోటలో ఉన్నట్లు చెప్పి అక్కడికి రమ్మన్నాడు. కొద్ది సమయం తర్వాత లోకేష్ జీడి తోటకు వెళ్లి తన తండ్రిని వెదుకుతుండగా ఒక చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో వెంటనే అక్కడి వారికి చెప్పాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

రహదారి ఏర్పాటు చేయాలని ఆందోళన



రైల్వేస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

రాయగడ:

జిల్లాలోని మునిగుడలో టికిరపడ రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ గ్రౌండ్ రహదారిని నిర్మించాలని ప్రగతి మంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. దీనిలో భాగంగా మునిగుడలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ వరకు వందలాది మంది ఆందోళనకారులు ర్యాలీలో పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. అనంతరం రైల్వేస్టేషన్ ఎదుట బైఠాయించారు. టికిరిపడ ప్రధాన రహదారి వద్దనున్న రైల్వే లెవెల్ క్రాసింగ్ కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ లెవెల్ క్రాసింగ్ వద్ద గేటు పడుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అందువలన అండర్ గ్రౌండ్ రహదారి ఏర్పాటు చేయాలని గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో ఆందోళన చేస్తున్నామని ప్రగతి మంచ్ అధ్యక్షుడు సీహెచ్ గణేశ్వరరావు, నందకిషోర్ పట్నాయక్, సింహాచల్ పండ తదితరులు తెలియజేశారు.

పెరుగుతున్న వాయు కాలుష్యం

భువనేశ్వర్: నగరంలో వాయు కాలుష్యం క్రమంగా పెరుగుతోంది. ఇటీవల కాలంలో వాయు నాణ్యత శాతం దిగజారుతోంది. ప్రధానంగా ఈ ఏడాది దీపావళి తర్వాత నుంచి ఈ కాలుష్యం మరింత అధికమైంది. తాజా సమాచారం ప్రకారం నగరంలో వాయు నాణ్యత 171 యూనిట్లకు పరిమితం అయింది. జాతీయ స్థాయిలో కలవరపరుస్తున్న ఢిల్లీ వాయు నాణ్యత (ఏక్యూఐ) 371 యూనిట్లు కొనసాగుతున్న తరుణంలో నగరంలో పరిస్థితి దీని చేరువకు పాకుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. నగరంలో తాజా వాయు నాణ్యత లెక్క ప్రకారం భువనేశ్వర్ రెడ్ కేటగరీలోకి చేరింది. ఏక్యూఐ 151 నుంచి 200 యూనిట్ల మధ్య చేరితే ఆ ప్రాంతం వాయు కాలుష్యం ప్రమాదం అంచుల్లో ఉన్నట్లు పరగణిస్తారని వాతావరణ నిపుణుల సమాచారం.

క్లుప్తంగా

ఇందోగుల్ఫ్ క్రాప్ కంపెనీ క్లోరోపైరిపాస్ మందు వాడొద్దు...

విజయనగరం ఫోర్ట్: ఇందోగుల్ఫ్ క్రాప్ సైన్సెస్ లిమిటెడ్ వారి బ్యాచ్‌నెం.ఎస్‌సీఏసీఎల్062401 ఈ గల క్లోరోపైరిపాస్ 50 శాతం ఈసీ పురుగు మందు రీజనల్ కోడింగ్ సెంటర్ అమరావతి నందు నాసిరకం అని తేలిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురుగు మందును నిల్వ చేయడం, అమ్మడం నిషేధించారని రైతులు ఈ విషయాన్ని గమనించాలని, దీన్ని వాడరాదని సూచించారు.

జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న 71వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 24న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగారావుదొర, కెవి.ప్రభావతి శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పురుషులు 85 కేజీలలోపు, మహిళలు 75 కేజీలలోపు బరువు మించకూడదని స్పష్టం చేశారు. ఆ రోజు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి 9949721949 నంబరును సంప్రదించాలని సూచించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి...

విజయనగరం క్రైమ్: దళిత మహిళను ప్రేమించి, వివాహం చేసుకోవడానికి నిరాకరించి, మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు విజయనగరం డీఎస్పీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంట్యాడ మండలం కిర్తిబర్తి గ్రామానికి చెందిన శినగం వెంకట సత్యం ప్రస్తుతం బాపట్ల జిల్లా స్టువర్ట్‌పురం వద్ద రైల్వే శాఖలో పాయింట్స్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఫ్యాకల్టీగా పని చేశాడు. అదే కళాశాలలో ఫ్యాకల్టీగా పని చేసే దళిత మహిళతో పరిచయం ఏర్పరచుకుని ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. తర్వాత వివాహం చేసుకుంటానని చెప్పి ఆమెను శారీరకంగా అనుభవించాడు. సదరు మహిళ వివాహం చేసుకోమని ఒత్తిడి చేయగా కులం పేరుతో దూషించి, వివాహం చేసుకోవడానికి నిరాకరించాడని పేర్కొన్నారు. దీంతో ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై గంట్యాడ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసారని తెలిపారు. కేసు నమోదు చేసినప్పటి నుంచి సదరు నిందితుడు పరారీలో ఉండగా, గురువారం అందిన సమాచారంతో అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫిట్స్.. తప్పిన ప్రమాదం


ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ మున్నా

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమ్మడ నుంచి రేగులపాడు గ్రామానికి శుక్రవారం మొక్కజొన్న తొక్కును ట్రాక్టర్‌తో తీసుకువెళ్తున్న డ్రైవర్ మున్నాకు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చింది. సరిగ్గా వీరఘట్టం పట్టణంలోని తెలగ వీధి మలుపు నుంచి ప్రధాన రహదారిపైకి ట్రాక్టర్‌ను ఎక్కిస్తుండగా ఫిట్స్ వచ్చింది. దీంతో ఒక్కసారిగా ట్రాక్టర్ ముందు భాగం పైకి లేవడంతో ట్రాక్టర్ తొట్టిలో మొక్కజొన్న తొక్కుపై ఉన్న నలుగురు మహిళలు భయంతో కేకలు వేశారు. ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడబోతుండగా సమీపంలో ఉన్న కొందరు ఆటో డ్రైవర్లు, వ్యాన్ డ్రైవర్లు వెంటనే ట్రాక్టర్‌పైకి ఎక్కి ఇంజన్‌ను అదుపు చేశారు. ట్రాక్టర్‌ను రోడ్డుపైకి తీసుకువచ్చారు. సీటులో ఫిట్స్ వచ్చి కాలు, చేతులు కొట్టుకుంటున్న డ్రైవర్ మున్నాను కిందకు దించి సపర్యలు చేసారు. దీంతో కొద్ది సేపటికి డ్రైవర్ సాధారణ స్థితికి వచ్చి ఆరోగ్యం కుదుటపడింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

వర్ష సూచన

విజయనగరం ఫోర్ట్: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో ఈ నెల 25 నుంచి 26వ తేదీ వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లా రైతాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకుపోవాలన్నారు. వరి యంత్రాలతో 25లోగా కోత పూర్తిచేయాలన్నారు. కూలీలతో కోయించేవారు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఎండిన వరి చేనును కుప్పలుగా చేసి భద్రపర్చుకోవాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹127	₹224	₹234

చివరిలో తెగుళ్ల దాడి

- వరి పంటకు ఆశించిన రెల్లరాల్చు పురుగు
- వరి కంకులను విరిచేస్తున్న వైనం
- ఆందోళనలో రైతులు
- 1121, సోనామసూరి రకాలకు ఆశించిన పురుగు


గంట్యాడ మండలం పెదవేమలిలో పురుగు ఆశించడం వల్ల దెబ్బతిన్న సోనామసూరి రకం వరి పంట


విజయనగరం మండలం పినవేమలిలో రెల్లరాల్చు పురుగు ఆశించడం వల్ల దెబ్బతిన్న 1121 రకం వరి


పెదవేమలిలో పురుగు ఆశించడంతో దెబ్బతిన్న వరి పంటను చూపిస్తున్న రైతు


రెల్ల రాల్చు పురుగు

విజయనగరం ఫోర్ట్: ఖరీఫ్ వరి పంట చివర దశకు వచ్చేసింది. సీజన్‌లో వర్షాలు అనుకూలించి ప్రకృతి సహకరించిన ప్రాంతాల్లో ఇప్పటికే కోతలు కూడా ప్రారంభమయ్యాయి. మిగిలిన చోట్ల మరో వారం, పది రోజుల్లో పంట చేతికంది వస్తుందన్న దశలో వరి పంటకు పురుగు ఆశించడంతో దిగుబడులపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కంకులను పురుగు విరిచేస్తుండడంతో దిగుబడి పడిపోతుందని అన్నదాత దిగులు పడుతున్నాడు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఏమి చేయాలో తోచడం లేదు.

1121, సోనామసూరిలకు ఆశించిన పురుగు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట 97 వేల హెక్టార్లలో సాగైంది. వీటిలో ఎక్కువగా రైతులు 1121 వరి రకాన్ని సాగు చేసారు. 80 వేల హెక్టార్ల వరకు 1121 రకం సాగవ్వగా మిగిలిన పొలంలో సోనామసూరి, సాంబమసూరి, స్వర్ణ తదితర రకాలను రైతులు సాగు చేసారు. వరి పంటకు ప్రస్తుతం రెల్లరాల్చు పురుగు ఆశించింది. ఈ పురుగు వరి పంట కంకులను విరిచేయడంతో ధాన్యం నేలపాలవుతున్నాయి.

దిగుబడిపై ఆందోళన

పంట చివరి దశలో రెల్ల రాల్చు పురుగు ఆశించడంతో కంకులు విరిగిపోతున్నాయి. దీని వల్ల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ధాన్యం దిగుబడి తగ్గిపోతుందని ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది పంటను బట్టి ఎకరానికి 26 నుంచి 28 బస్తాలు దిగుబడి వస్తుందని రైతులు భావించారు. అయితే పురుగు ఆశించడం వల్ల ఎకరానికి 15 నుంచి 18 బస్తాలకు మించి దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పురుగు మందు పిచికారీ చేయడానికి వీల్లేని పరిస్థితి

వరి పంటకు వాశించిన పురుగు నివారణకు పురుగు మందు పిచికారీ చేయడానికి వీల్లేని పరిస్థితి. రెల్ల రాల్చు పురుగు నివారణకు పురుగు మందు పిచికారీ చేయాలంటే వరి కోతకు 10, 15 రోజులు సమయం ఉండాలి. కానీ జిల్లాలో చాలా చోట్ల వరి కోతలు కోయడానికి నాలుగైదు రోజులు సమయం మాత్రమే ఉంది. దీంతో పురుగు మందు పిచికారీ చేయడానికి వీలు కాని పరిస్థితి నెలకొంది.

క్షేత్ర స్థాయిలో పర్యటించని వ్యవసాయ సిబ్బంది

వ్యవసాయ సిబ్బంది రైతుల పొలాల్లో క్షేత్ర స్థాయి పర్యటనలు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నామని పాలకులు గొప్పలు చెప్పడం తప్పితే క్షేత్ర స్థాయిలో రైతులకు ఏ మేలు జరగడం లేదని చెబుతున్నారు. రెల్లరాల్చు పురుగు ఆశించడం వల్ల వరి కంకులు విరిగిపోయి రైతులకు నష్టం వాటిల్లుతున్నా వ్యవసాయ అధికారులు సూచనలు అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురుగు ఆశించింది..

జిల్లాలో రెల్లరాల్చు పురుగు వరి పంటకు ఆశించిన మాట వాస్తవమే. రెల్లరాల్చు పురుగు ఆశించినట్ట యితే క్లోరోపైరిపాస్ మందు ఎకరానికి 500 ఎం.ఎల్ సాయంత్రం పూట వరి పంట బాగా తడిచేటట్టు పిచికారీ చేయాలి. వ్యవసాయ అధికారులు, సిబ్బందిని పొలాల్లో పర్యటించి పురుగు నివారణ చర్యలు గురించి తెలియజేయాలని ఆదేశించాం.

– వి.తారకరామరావు, జిల్లా వ్యవసాయ అధికారి

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

- కార్మిక, రైతు సంఘాల నేతలు


కరపత్రాలను విడుదల చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: కేంద్రం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌పీఆర్ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అయినా తమ విధానాల్లో మార్పు లేదన్నారు. కుక్కతోక ఒంకరని మరోసారి మోదీ ప్రభుత్వం రుజువు చేసుకుందన్నారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం, జనసేన ప్రభుత్వాలు రాష్ట్రంలో అదే విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. సర్వసంపదలు సృష్టించేది కార్మికవర్గం, ప్రజలకు తిండిపెట్టేది రైతాంగమని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. కేవలం కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు అనుకూలంగా గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28లక్షల కోట్లు రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని దోచి పెట్టిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా భారీ పరిశ్రమలు, గనులు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. వ్యవసాయ దేశమైన భారతదేశంలో కార్మిక వర్గం, రైతాంగంతో కలిసి ఐక్యంగా పోరాడితేనే మన లక్ష్యం సాధించగలమన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కార్మిక వర్గాన్ని, రైతాంగాన్ని చీల్చాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నిరంతరం ప్రయత్నిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ 26న కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాలో కార్మికులు, రైతులు, ప్రజా సంఘాలు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, కార్యదర్శి ఎ.జగన్‌మోహన్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఇఫ్టూ నాయకులు కె.అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ


సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామివారి దేవస్థానంలో స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం కనుల పండువగా సాగింది. కార్తీక శుక్రవారం సందర్భంగా సాయంత్రం స్వామివారి ఆస్థాన కల్యాణ మండపంలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు ముందుగా స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను చేపట్టారు. అనంతరం వేద మంత్రోచ్చారణ నడుమ కల్యాణ మండపంలో ఉన్న ప్రత్యేక ఊయల్లో స్వామివారిని వేంచింపజేసి ఊంజల్ సేవను అత్యంత వైభవంగా జరిపించారు. భక్తులే స్వయంగా స్వామివారికి దీపాలంకరణ సేవ చేసే భాగ్యం కలగడంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలను వెలిగించారు. అనంతరం అర్చకస్వాములు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి : పీఓ


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆకాంక్షించారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి నేపథ్యంలో జన్ జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు జరిగాయి. అందులో భాగంగా వాలీబాల్, జావలింగ్ త్రో, ఆర్చరీలలో విజేతలుగా ఎంపికైన 28 మంది విజేతలకు శుక్రవారం ఆయన కార్యాలయం వద్ద పీఓ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొంది పతకాలతో తిరిగిరావాలని ఆశీర్వదించారు.

24న జరగబోయే రాష్ట్ర స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలకు 33 మంది విద్యార్థినులు, 22 మంది గిరిజన కళాకారుల బృందం పాల్గొంటున్నట్లు తెలిపారు. 25న రాష్ట్ర స్థాయిలో జరగనున్న వ్యాసరచన, పెయింటింగ్, వక్తృత్వ పోటీల్లో 9 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు జీఎంఆర్ విద్యార్థులు


ఎస్.సాయిసుధీర్


పి.మహేంద్రరావు


వి.నిహారిక


పి.దీపిక


ఎన్.రుచిత


వి.శరత్

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన ఎంపికలో సబ్ జూనియర్, జూనియర్ విభాగంలో విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. సబ్ జూనియర్ విభాగానికి సంబంధించి 105 కేజీల విభాగంలో పి.మహేంద్రరావు, 120 కేజీల విభాగంలో ఎస్.సాయిసుధీర్, 52 కేజీల విభాగంలో వి.నిహారిక, 72 కేజీల విభాగంలో పి.దీపిక, 63 కేజీల కేటగిరీలో ఎన్.రుచితలు ఎంపికయ్యారని అన్నారు. అలాగే జూనియర్ విభాగానికి సంబంధించి 59 కేజీల కేటగిరీలో వి.శరత్ ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా ఈ నెల 24 నుంచి 27 వరకు తమిళనాడు రాష్ట్రం సలేం డివిజన్ డీఆర్ఎం ఆఫీస్ రైల్వే క్వార్టర్స్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపిక పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, పీడీ బి.అరుణ్‌కుమార్, విద్యార్థులు అభినందించారు.

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే మందులు వాడొద్దు..


ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ రాణి

- డీఎంహెచ్ఓ డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే ఎటువంటి మందులు వేసుకోరాదని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.రాణి సూచించారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్సీ అవగాహన ర్యాలీని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ సూచన మేరకు అవసరమైనన్ని రోజులు మందులు వాడాలన్నారు. మందులు ఎక్కువ వాడితే అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎంఓ మణి, న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ అర్చనదేవి, ఎపిడిమాలజిస్టు వెంకటేష్ , డెమో చిన్నతల్లి పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్ మందులు అతిగా వాడరాదు

యాంటీ బయాటిక్ మందులు అతిగా వాడరాదని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద శుక్రవారం ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్సీ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన ర్యాలీని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి, మైక్రో బయాలజి హెచ్ఓడీ డాక్టర్ బి.అరుణశ్రీ, అసోసియేట్ ప్రొఫెసర్ పార్వతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ లావణ్య పాల్గొన్నారు.

మూడు నెలల వరకు పింఛన్ బకాయి చెల్లింపు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఎన్‌టీఆర్ భరోసా పింఛను పథకం కింద మూడు నెలల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ ఆయన నిర్వహించారు. పింఛను పంపిణీ వ్యవధిలో అందుబాటులో లేనివారు, పింఛను తీసుకోని పింఛనుదారులకు మూడు నెలల వరకు పింఛను బకాయిలు చెల్లించడం జరుగుతుందన్నారు. బకాయిల చెల్లింపు 2024 నవంబర్ 1 నుంచి అమలులోకి వస్తుందన్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి విడుదల అవుతుందని ఆయన వివరించారు. పింఛనుదారు ఏదైనా కారణం చేత పింఛను తీసుకోకపోతే, అది తాత్కాలిక వలసగా పరిగణించడం జరుగుతుందని చెప్పారు. ఎవరైనా పింఛనుదారు ఒక నెలలో పింఛను (తాత్కాలిక వలస) తీసుకోకపోతే, ఒక నెల బకాయితో పాటు రెండవ నెల పింఛను విడుదల చేయడం జరుగుతుందని, పింఛనుదారులు రెండవ నెలలో కూడా పింఛను తీసుకోని పక్షంలో ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద పింఛనుదారులకు సౌకర్యాలు కల్పించేందుకు రెండు నెలల బకాయిలతో పాటు మూడవ నెల పింఛను కూడా విడుదల చేయనున్నట్లు ఆయన వివరించారు. పింఛనుదారులు మూడు నెలలు వరుసగా పింఛను తీసుకోకపోతే శాశ్వత వలసగా పరిగణించి వారి పింఛను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత నిబంధనలపై పింఛనుదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పింఛను పంపిణీని పర్యవేక్షించాలని అన్నారు.

రసీదు తీసుకుని ఇసుక తీసుకెళ్లండి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్:

జిల్లాలో 48 ఇసుక రీచ్‌లు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రీచ్‌కు పంచాయతీ కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమించామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఇసుక కావలసిన వారు పంచాయతీ కార్యదర్శి యాప్‌లో రిజిస్ట్రేషన్‌తోపాటు రసీదును తీసుకున్నాక ట్రాక్టర్, ఎడ్ల బండ్లపై ఉచితంగా ఇసుక తరలించాలన్నారు. పోలీసులకు రసీదు చూపిస్తే వదిలేస్తారని తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రేగిడి ఆమదాలవలస మండలం కె.వెంకటాపురం వద్ద 72 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను మాన్యువల్‌గా తవ్వేందుకు కొత్త రీచ్‌కు అనుమతి లభించిందని, త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. డెంకాడ వద్ద స్టాక్ పాయింట్‌ను శనివారం నుంచి తెరుస్తామన్నారు. వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద ఇసుక తవ్వడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని నారాయణపురం గ్రామస్తులు అసంతృప్తిగా ఉన్నారని తహసీల్దార్ తెలుపగా, క్వారీ అనంతరం రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టడానికి కమిటీలో ఫైల్ పెట్టాలని సూచించారు. సమావేశంలో జేసీ సేతుమాధవన్, అదనపు ఎస్పీ సత్యలత, రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్, ఆర్డీఓ కీర్తి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, పీసీసీబీ ఈఈ సరిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కవిత, గనులశాఖ ఐటీ తులసీరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మంత్రి సవిత రాజీనామా చేయాలి


- మాజీ ఎమ్మెల్యే కళావతి


మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ఏపీ శాసనమండలిలో రాష్ట్ర మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి సవిత తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేసారు. శుక్రవారం ఆమె వండువలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డీబీటీ డబ్బుల ద్వారా మహిళలు గంజాయి, మద్యానికి బానిసలు అయ్యారని మంత్రి సవిత చేసిన వ్యాఖ్యలపై కళావతి మండిపడ్డారు. వెంటనే మంత్రి సవిత రాష్ట్ర మహిళలకు క్షమాపణలు చెప్పాలని కోరారు. ఒక మహిళా మంత్రిగా ఉండి రాష్ట్ర మహిళల పట్ల ఇంత నీచంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. మంత్రి సవిత శాసన మండలిలో రాష్ట్ర మహిళల పట్ల చాలా దుర్మార్గంగా మాట్లాడారని మండిపడ్డారు. ఇటువంటి వారికి చట్టసభలకు వెళ్లే అర్హత లేదన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు... ఈ హామీ ఎప్పుడు నెరవేరుస్తారని కళావతి ప్రశ్నించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారం వచ్చిన తర్వాత ఈ హామీకి తూట్లు పొడుస్తూ ఈ ఏడాది ఒక్క గ్యాస్ సిలెండర్ ఇచ్చి రెండు సిలెండర్లను బొక్కేసారని ఆవేదన వ్యక్తం చేసారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిసారీ గత ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకుని ఇటువంటి సభలను పక్కదోవ పట్టిస్తున్నారని కళావతి ఆవేదన వ్యక్తం చేసారు.

గుజ్జింగివలసలో అగ్ని ప్రమాదం

- రూ.10లక్షల ఆస్తి నష్టం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన నగదు


పెంకిటిల్లులో నుంచి వస్తున్న పొగలు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన కె.విశ్వేశ్వరరావు పెంకిటిల్లు పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో సుమారుగా నగదు రూ.4లక్షలు, ఇంట్లో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ మొత్తం రూ.పది లక్షల వరకు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. కష్టపడి సంపాదించిన నగదు మొత్తం కాలిపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంఘటన స్థలానికి అగ్ని మాపక సిబ్బంది చేరుకొని మంటలు అదుపు చేశారు.

రూ. 3 వేల కోట్లతో అభివృద్ధి పనులు

- పేద ప్రజలకు జీవనోపాధి కల్పనే లక్ష్యం
- జాతీయ ఉపాధిహామీ పథకం కేంద్ర డిప్యూటీ కార్యదర్శి ఆశిస్ గుప్తా


కొట్టక్కిలో ఉపాధి పనులకు సంబంధించి రికార్డులు పరిశీలిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ కేంద్ర డిప్యూటీ కార్యదర్శి ఆశిస్ గుప్తా

రామభద్రపురం: రాష్ట్రంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.3 వేల కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, చెక్‌డ్యామ్‌లు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జాతీయ ఉపాధిహామీ పథకం కేంద్ర డిప్యూటీ కార్యదర్శి ఆశిస్ గుప్తా అన్నారు. మండలంలోని కొట్టక్కి, కాకర్లవలస, తారాపురం గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను స్టేట్ డైరెక్టర్ షణ్ముక్ కుమార్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. అలాగే పండ్ల తోటలు, చెరువు గట్లపై నాటిన మొక్కలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాలలో ఉద్యాన పంటలు వేశారు..? ఎకరాకు ఎన్ని మొక్కలు వేశారు..? మెయింటినెన్స్ నిధులు అందుతున్నాయా, లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి 30 వేల అభివృద్ధి పనులు మంజూరు కాగా.. డిసెంబర్ 31లోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉపాధి కల్పనే లక్ష్యం..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు జాతీయ ఉపాధిహామీ పథకం కేంద్ర డిప్యూటీ కార్యదర్శి ఆశిస్ గుప్తా అన్నారు. ఉపాధి వేతనం ప్రతి సంవత్సరం పెంచుతున్నట్లు చెప్పారు. జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో 23 వేల గోకులాల షెడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ప్రోగ్రాం అధికారి కిరణ్ పాడి, డ్వామా పీడీ కల్యాణ్ చక్రవర్తి, ఎంపీడీఓ రత్నం, ఏపీడీలు కిరణ్, శ్రీనివాసరావు, ఏపీఓలు త్రినాథరావు, విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.